నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 17, 2024 | www.navatelangana.com

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో వైద్యుల నియామకానికి శనివారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో జరిగాయి. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్ వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల నిజ ధ్రువపత్రాలను పరిశీలించారు. నియామకాలు మెరిట్ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్ఆర్) విధానంలో చేపడతామని డైరెక్టర్ స్పష్టం చేశారు.



ఇచ్చోడ వాసికి ఉత్తమ రైతు అవార్డు

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు రామేశ్వర్ గైక్వాడ్ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్ సిటీలో గ్రామ భారతి తరపున మార్చి 16, 17న జరుగుతున్న ఎక్స్‌పో కిసాన్ మేళాలో భాగంగా అవార్డులు అందజేశారు. 10 సంవత్సరాల నుంచి భూమిని, పర్యావరణాన్ని కాపాడుతూ సమాజారోగ్యం కోసం పంటలు పండిస్తున్న నవేగాం గ్రామానికి చెందిన రైతు రామేశ్వర్ గైక్వాడ్ ఈ అవార్డు అందుకున్నాడు.



మోగిన నగారా..అమల్లోకి కోడ్..!

- షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల సంఘం
- లోక్‌సభ సమరానికి సన్నద్ధమవుతున్న పార్టీలు
- అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్, బీజేపీ
- ఈ నెల 18న ఖరారు చేయనున్న కాంగ్రెస్
- లోక్‌సభ పరిధిలో 16,46,830మంది ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో కనిపించనున్న ఎన్నికల సందడి

లోక్‌సభ ఎన్నికల సమరానికి సమయం రానే వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఆదివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్న నేపథ్యంలో కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఆటంకం కలగనుంది. మరోపక్క లోక్‌సభ సమరంలో పాల్గొనేందుకు రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి.ఇప్పటికే ఆయా పార్టీలు కార్యాచరణ సిద్ధం చేసుకోగా.. అటు అధికార యంత్రాంగం సైతం ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తు పూర్తిచేసింది. ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం తదితర వాటిని సిద్ధం చేస్తోంది. ఇప్పటికే లోక్‌సభ పరిధిలోని అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేశారు. ఇక రాజకీయ పార్టీలు సైతం షెడ్యూల్ కోసమే ఎదురుచూశాయి. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయడంతో లోక్‌సభ బరిలో నిలిచేందుకు పార్టీలు సిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగం సంసిద్ధమవుతోంది. ఎన్నికల సమయంలో తలపడేందుకు పార్టీలు సిద్ధం కాగా.. ఎన్నికల కోడ్ అమలు..పోలింగ్..కౌంటింగ్ నిర్వహణలో అధికార యంత్రాంగం తలమునకలవుతోంది. మరోపక్క ప్రధాన రాజకీయ పార్టీలు ఒకడుగు ముందుకేసి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బరిలో నిలవగా.. బీజేపీ నుంచి మాజీ ఎంపీ గోడం నగేష్ పోటీలో ఉండనున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఈ నెల 18న అభ్యర్థిని ఖరారు చేయనుందని తెలిసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలువురి పేర్లపై కసరత్తు చేసింది. అభ్యర్థి ఎంపిక ఫైనల్‌గా మారింది. ఈ మూడు ప్రధాన పార్టీలతో పాటు గుర్తింపు కలిగిన రాజకీయపార్టీలు, పలువురు స్వతంత్రులు సైతం బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. మరోపక్క నామినేషన్ల పర్వం ఏప్రిల్ 18నుంచి 25వ తేదీ వరకు గడువు ఉండటం..మే 13న ఎన్నికలు నిర్వహించడంతో ఆయా పార్టీలకు ప్రచారం చేసుకునేందుకు సుమారు రెండు నెలల పాటు సమయం ఉంటుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలు సైతం విజయంపై దృష్టిసారిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది.



ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం..!

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా వీటి పరిధిలో 16,44,715మంది ఓటర్లు ఉండగా పురుషులు 8,02,575మంది ఉండగా మహిళలు 8,42,054మంది ఉన్నారు. వీటితో పాటు మరో 2115మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం పూర్తిగా నిమగ్నమైంది. ఇప్పటికే వివిధ రకాల పనులను పూర్తిచేసింది. మొదటి దశలో ఈవీఎంల పరిశీలన చేపట్టడం, ఏడు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల పరిశీలన, ఓటర్ల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వీటిలో కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. వీటితో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు వాటి వద్ద చేపట్టాల్సిన చర్యలపైనా సమీక్ష నిర్వహించారు. వీటితో పాటు ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకొని ఉండటంతో ఆ రాష్ట్ర అధికారులతోనూ జిల్లా అధికారులు సమావేశమై బందోబస్తుపై చర్చించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద ఏర్పాటుచేస్తున్న చెక్‌పోస్టుల ప్రాంతాలను పరిశీలించారు. మరోపక్క ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల్లో మద్యం, డబ్బుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

అంతటా ఎన్నికల సందడి..!

ఎన్నికలు అనగానే రాజకీయ పార్టీలతో పాటు ప్రజల్లోనూ ఓ రకమైన ఉత్సాహం ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకఘట్టంగా భావించే ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సందడి వాతావరణం కనిపించింది. ప్రధాని మోదీతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ఆయా పార్టీల రాష్ట్ర అధ్యక్షులు జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికలు ముగిసిపోవడం.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగిపోయింది. ఇక రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని సైతం ఇప్పటికే ప్రారంభించాయి. తెలంగాణ పునర్నిర్మాణం పేరిట ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ్నుంచే లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఇక విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆదిలాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీ బీజేపీని గెలిపించాలని పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా అగ్రనేతల రాకతో ఎన్నికల వాతావరణం ఇప్పటికే మొదలు కాగా.. రానున్న రోజుల్లో మరింత మంది కీలక నాయకులు జిల్లాలో ప్రచారానికి వస్తారని తెలుస్తోంది.ఉమ్మడి జిల్లాలో మే 13వ వరకు ఎన్నికల వాతావరణం కనిపించనుంది.

కాన్షీరాం కలల రాజ్యాన్ని సాధిద్దాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాధిత పీడిత వర్గాల కోసం ఉద్యమించిన మహనీయుడు కాన్షీరామ్ కలలు కన్న రాజ్యాన్ని సాధిద్దామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో గల డీఎస్పీ జెండా దిమ్మె వద్ద కాన్షీరామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలు సమర్పించి, పార్టీజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశయాలను సాధించేందుకే తెలంగాణ రాష్ట్రంలో ధర్మ సమాజ పార్టీ ఆవిష్కృతమైందని పేర్కొన్నారు. పీడిత జాతులను ఏకం చేసి బహుజన రాజ్యాన్ని నిర్మించిన కాన్షీరాం కలల నుండి డిఎస్పి ఉద్భవించిందని పేర్కొన్నారు. ఏడాది క్రితం కాన్షీరామ్ జయంతి రోజున ఉద్భవించిన డిఎస్పి రాష్ట్ర అధినేత డాక్టర్ విశారదన్ నేతృత్వంలో రాజ్యాధికారం దిశగా సాగుతుందని పేర్కొన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పీడిత ప్రజల విముక్తి ప్రదాతల జన్మదినోత్సవ కార్యక్రమాలను జరుపుతున్నామని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బడుగు రాజేశ్వర్, నలగంటి రవి, బండారి సంతోష్, సంగర్తి రాంచందర్, నవీన్‌కుమార్, ఏ.సాయి, సురేష్, విఠల్, వినుకుమార్, శ్రీనివాస్, చరణ్ పాల్గొన్నారు.

వైద్యుడు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పిట్ట బొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని జడ్పిటిసి అర్క పుష్పలత అన్నారు. శుక్రవారం ప్రజల ఆందోళన నేపథ్యంలో శనివారం ఆమె పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల రిజిస్టరును తనిఖీ చేశారు. ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చే ఓపి రిజిస్టరును పరిశీలించారు. అనంతరం వైద్యునితో మాట్లాడుతూ ప్రతినిత్యం డ్యూటీకి రావాలని, సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని తెలిపారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షులు ఆరెల్లి రాజలింగం, పెందూర్ గణేష్, వినోద్ శర్మ ఉన్నారు.

ఎంపీటీసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-ఇచ్చోడ

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహం తీర్చడానికి ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి తన సొంత ఖర్చుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం తపాలా శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా చలి వేంద్రాని ఏర్పాటు చేస్తున్న ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కమల జలైజాకు, నాయకులు గట్టు మహేందర్‌రెడ్డి, మామిడి విజయ్, తపాలా శాఖ సిబ్బంది పోశాలు, శ్రీను పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం వద్ద శనివారం డాక్టర్ రమేష్‌రెడ్డి తిరుమల ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వేణుగోపాలకృష్ణ, పిల్లల వైదుడు మురళీధర్, ఎముకల వైద్యుడు శివకుమార్ వివిధ రకాల రోగులను పరీక్షించి ఉచిత వైద్య సేవలు అందించారు. పేద ప్రజలకు, రోగులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి ఉచిత మందులను అందించారు. తిరుమల ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ, రీయింబర్స్‌మెంట్ సేవలు ఉచితంగా అందిస్తున్నామని, నరాల పరీక్షలు, కొన్ని రక్త పరీక్షలపై వేణుగోపాలకృష్ణ గ్రామ ప్రజలకు వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు శైలేష్, జిల్లా నాయకులు డి.ముత్యంరెడ్డి, ఉప సర్పంచ్ సామ రాజేశ్వర్‌రెడ్డి, దనె నర్సయ్య, సాయినాథ్, పండరి పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు వెంటనే అందించాలి

ఆదిలాబాద్‌టౌన్ : మున్సిపల్ కార్మికులకు పెరిగిన వేతనాలు వెంటనే అందించాలని ఏఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కుంటల రాములు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కొత్త కార్మికులను తీసుకోవద్దని కోరారు. పారిశుధ్య కార్మికులుగా పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగుల కుటుంబాల సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

పాడి పశువుల పెంపకంతోనే రైతు ఆర్థికాభివృద్ధి

ఇచ్చోడ : వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మండల పశువైద్య అధికారి డాక్టర్ గోవింద్ నాయక్ అన్నారు. శనివారం ముక్రా(బి) గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 350 ఆవులకు, 220 గేదెలకు, 150ఎద్దులకు గాలి కుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు : ఎమ్మెల్యే అనిల్

బోథ్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని పొచ్చెర వాటర్ ఫాల్ సమీపంలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మరింత నీటి సౌకర్యం కల్పించడానికి రూ.3కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించి రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై అవగాహన

నార్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌లాల్ సూచించారు. శనివారం ఐకెపి కార్యాలయంలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులతో కమిటీ ఏర్పాటుపై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో ఎపిఎం మైస రమేష్, సిసిలు కిషన్, శ్రీరాం, సంతోష్, చంద్రకాంత్, రేవయ్య వివిధ గ్రామాల విఓఏలు పాల్గొన్నారు.

మానసికంగా దెబ్బతీయడానికే కవిత అరెస్ట్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- బీజేపీ ఫ్లెక్సీ దహనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన వస్తున్న క్రమంలో తెలంగాణలో ప్రజాదరణ పొందుతున్న బీఆర్ఎస్‌ను మానసికంగా దెబ్బతీయడానికే ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం పార్టీ కార్యాలయం నుంచి నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. కలెక్టర్ చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ ఫ్లెక్సీని దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సీఎం కేసీఆర్‌ను భయపెట్టలేరన్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌ను తక్కువ చేయడానికే ఇన్నేండ్లుగా లేని కేసులు ఇప్పుడు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దర్యాప్తు సంస్థలను చేతుల్లో పెట్టుకొని బీఆర్ఎస్‌ను ఓడించమే లక్ష్యంగా పని చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారని, ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేష్, నాయకులు సెవ్వ జగదీష్, రోకండ్ల రమేష్, భరత్, రాము, రంగినేని శ్రీనివాస్, ప్రహ్లాద్, దాసరి రమేష్, పర్వీన్, పవన్ నాయక్ పాల్గొన్నారు.



బోథ్: మండలంలోని సోనాల గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం బంద్ పాక్షికంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా శని, ఆదివారాలు కోర్టుకు సెలవు ఉంటుందని పథకం ప్రకారమే అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అల్లంకొండ ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్క రాజు, ఆత్మ చైర్మన్ సుభాష్, మండల యూత్ అధ్యక్షుడు మేడిచెల్మ ప్రవీణ్, నాయకులు రఫీ, ఎప్తేకర్, రమణ, నారాయణ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



నిర్మల్ : పార్లమెంట్ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టార్, రూట్, పోలీస్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సెక్టార్, రూట్, పోలీసు అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలు కాగానే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనల పోస్టర్లు ఉండకూడదని తెలిపారు. మద్యం అమ్మకాలు కూడా నిలిపివేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా ఎండాకాలం దృష్ట్యా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, అత్యవసర వైద్య సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. గతంలో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ఓటింగ్ ఓటింగ్ శాతం పెంచడానికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమస్యలపై ఫిర్యాదులను చేయడానికి తెచ్చిన సీ విజిల్ యాప్ గురించి ఓటర్లకు తెలియజేయాలని తెలిపారు. ఎన్నికల టోల్ ఫ్రీ నంబరు - 1950పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికలు జరిగే 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలోనే 50 ఓట్లకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం : వీఆర్ఆర్ వరప్రసాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక రిసర్చ్ ద్వారా కొత్త కేసులు రాకుంటే తీర్పుల ద్వారా ఆ కేసులను పరిష్కరించడానికి 250 ఏండ్లు పడుతుందని తెలిసిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇందులో రాజీమార్గం ద్వారా కక్షిదారుల మధ్య కేసులను పరిష్కరించారు. అనంతరం వారికి రాజీపత్రాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టుల్లో తీర్పుల ద్వారా కేసుల పరిష్కారానికి సమయం పడుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, 1987లో గుజరాత్‌లో తొలిసారిగా లోక్ అదాలత్ నిర్వహించారని తెలిపారు. ఇలా దేశ వ్యాప్తంగా లోక్ అదాలత్‌లను నిర్వహిస్తూ రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు డాక్టర్ శివరాంప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, మంజుల సూర్యవార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, డీఎస్పీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోథ్ : రాజీ మార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ అన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో నేరం ఒప్పుకోవడం ద్వారా 223 కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో పిపి శ్రీధర్, బార్ అధ్యక్షులు వామన్‌రావ్, సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు మోహన్‌రావ్, దమ్మాపాల్, రూపేందర్ సింగ్, కుమ్మరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.





బోథ్ : మాట్లాడుతున్న న్యాయమూర్తి హుస్సేన్

కంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ఆదిలాబాద్‌టౌన్ : రానున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో వార్డ్ నెంబర్ 10 రాంనగర్ కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ జి.సాంబాజీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖయ్యూం, బిసి నాయకులు ఏ.భాస్కర్‌తో పాటు పలువురు కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. 100 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు దరి చేరాయని, గ్యారెంటీ హామీలతో ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని అన్నారు. అనంతరం మావలలోనూ కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో చేరికలు జరిగాయి. బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ దొగ్గలి ప్రమీల - రాజేశ్వర్‌తో పాటు గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి - వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, పిప్పర్‌వాడ ఎంపీటీసీ ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, యాల్ల పోతారెడ్డి, నాగర్కర్ శంకర్, కోరెటి కిషన్, డేరా కృష్ణారెడ్డి, అంబేద్కర్‌నగర్ కౌన్సిలర్ రోషిడ్ ఉల్ హాక్, మైనారిటీ నాయకులు ఉన్నారు.

నీటి కష్టాలు లేకుండా చూస్తా

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని దొంగచింత గ్రామంలో శనివారం రూ.2లక్షల సీడీఎఫ్ నిధులతో బోర్‌వెల్ పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నీటి కష్టాలు లేకుండా చూస్తానని అన్నారు. నీటి కష్టాలు ఉన్న గ్రామ ప్రజలు నేరుగా నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ ప్రజలు ఉన్నారు.

కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

నవతెలంగాణ-ఉట్నూర్

కవిత అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితను అక్రమ అరెస్టుకు నిరసనగా ఉట్నూర్ ఐబీ చౌరస్తా వద్ద రోడ్డు ఎక్కి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు రమేష్ మాట్లాడారు. అక్రమ అరెస్టుతో బయపెడితే ఎవరు భయపడేది లేదని అన్నారు. ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ నిరసనలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిరుధాన్యాలతోనే పోషకాభివృద్ధి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోషకాహార లోపాలను సరిదిద్దుకునేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని ఇందుకు పోషకాహార లోపంతో బాధపడే బాల బాలికలు తప్పనిసరిగా చిరుధాన్యాలనే ఆహారంగా తీసుకున్నప్పుడే వారికి ఆరోగ్యంగా ఉంటారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ వనజ, సూపర్‌వైజర్ గౌరీరాణి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం విద్యానగర్ 6వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఇందులో ప్రతి ఒక్కరికి చిరుధాన్యాల సాగు వాటి ఉపయోగాలు అంశాలను వివరించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే మహిళలకు గర్భిణీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, మనిషా, లలిత, ధనలక్ష్మి, సుందరి, గోదావరి, ఆఫీన్‌తో పాటు అంగన్‌వాడీ హెల్పర్లు కూడా పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిరికొండ

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ జి. సాయన్న అన్నారు. శనివారం మండలంలోని సొంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా చూడాలని అన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. నర్సరీ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. మొక్కలకు ప్రతి రోజూ నిరందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల గంగాధర్, ఏపీఓ భీంరావ్, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్, ఈశ్వర్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామాల్లో మౌలిక వసతుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ చట్టం ద్వారా రూ.2.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. మామిడిగూడ, సకరాం తండా, తదితర గ్రామాలకు బీటీ రోడ్లు, ఆశ్రమ పాఠశాలలో స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నాయకులు మెస్రం నాగానాథ్, ముకాడే ఉత్తం ఉన్నారు.

పౌష్టికాహారం తల్లి బిడ్డలకు శ్రేయస్కారం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని ఉట్నూర్ సీడీపీఓ వినూత్న అన్నారు. శనివారం మండలంలోని వడ్‌గావ్ అంగన్‌వాడీ సెక్టార్‌లో పోషణ్ పక్వాడ పక్షోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భంతో ఉన్నపుడే ఆకు కూరలు, గుడ్లు, కూరగాయలు, పాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్త హీనత రాకుండా ముందు జాగ్రత్త వహించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లి, బిడ్డకు ఎంతో శ్రేయస్కారమని అన్నారు. దీంతో మాతా శిశుమరణాలు కాకుండా అరికట్టవచ్చునన్నారు. బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఉంచాలనే ఉద్దేశంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు పాలు పండ్లను ఇచ్చి సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జాదవ్ ప్రమీల, పోషణ పక్వాడ జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్ అస్ఫక్, అంగన్‌వాడీ వర్కర్లు నాగుబాయి, కల్యాణి, గిరిజబాయి, సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ సర్పంచ్ చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల గ్రామ సర్పంచ్ దొగ్గలి ప్రమీల రాజేశ్వర్‌తో పాటు పలువురు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో గౌస్‌ఖాన్, మహేందర్, రాజు, విష్ణు, గౌరయ్య, బ్రహ్మం, సంతోష్, శ్రీనివాస్, పుష్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ పిప్పర్‌వాడ ఎంపీటీసీ ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగా రెడ్డి, నాగర్కర్ శంకర్, కోరేటి కిషన్, డేరా కృష్ణారెడ్డి, అంబేద్కర్ నగర్ కౌన్సిలర్ రషీద్ ఉల్ హాక్, ఎంఏ షకీల్, షేక్ ఖలీం, కయ్యూం, మొహమ్మద్ రఫీక్, అడెల్లు, కరంజి గ్రామ మాజీ సర్పంచ్ రతన్ రెడ్డి, ప్రభాకర్, మోరేష్, బండి నరసింహచారి, నర్ర విఠల్, ఎల్మ రామ్ రెడ్డి, అంజద్ ఖాన్, కర్మ, అయాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పది పరీక్షలు.. పకడ్బందీగా ఏర్పాట్లు..

- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేపటి నుంచి ఏప్రిల్ 2వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పరీక్షల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈసారి నిమిషం నిబంధన ఎత్తివేయగా ఐదు నిమిషాల వరకు విద్యార్థులను అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పేపర్ లీకేజ్ వంటి పరిణామాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ఇన్విజిలేటర్స్ ఉదయం 8 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకొని అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అన్నారు. విద్యార్థులు బ్లూ, బ్లాక్ పెన్స్ మాత్రమే వాడాలని, సీసీ కెమెరా ఫుటేజ్ రికార్డ్ అవుతుందా లేదా చెక్ చేయాలని, పరీక్షలకు సంబంధించిన ప్రతిదీ సీసీ కెమెరాల సమక్షంలోనే జరగాలని సూచించారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి...

పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:30 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్ష కేంద్రాలలో తాగునీరు, ఫర్నిచర్ అన్ని సదుపాయాలు, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలని అన్నారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. హాల్ టికెట్ తీసుకొని వారు వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాలలోకి విద్యార్థులు, అధికారులు పరీక్షల సిబ్బంది ఎవరు కూడా పరీక్ష కేంద్రాలలోకి మొబైల్స్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. పరీక్షలు పూర్తయ్యాక ప్రశ్న పత్రాలను పోలీస్ బందోబస్తుతో తరలించాలని అన్నారు, పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన అన్ని మందులతో పాటు వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో సహా వైద్య బృందాల ఏర్పాటు, అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాను అందించాలని కోరారు. సకాలంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థుల సౌకర్యాలతో బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది పరీక్షల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు. ఇన్విజిలేటర్‌లు సిట్టింగ్, ఫ్లయింగ్ స్కాడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ వినోద్ కుమార్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ 18న ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని, ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 7,34,824 ఓటర్లు ఉన్నారని, మొత్తం 922 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుదీకరణ వంటి వసతులను కల్పిస్తామని అన్నారు. డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు అఫిడవిట్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన 100 నిమిషాల లోపే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. నిర్మల్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు మీడియా ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. పోలింగ్ శాతం పెంచేందుకు, సీ విజిల్ యాప్‌పై, ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 గురించి ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో రాజకీయ నాయకులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా స్వీయ నియంత్రణ కలిగి ఉండాలన్నారు. కుల మతాలను రెచ్చగొట్టే విధంగా, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లే సమయంలో అనుమతి పత్రాలు ఉండాలని తెలిపారు. లైసెన్స్ ఉన్న తుపాకుల్ని వెంటనే యజమానులు పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని ఆదేశించారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. అంతకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, నిర్మల్ భైంసా ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీపీఆర్ఓ విష్ణువర్ధన్ అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి

నవతెలంగాణ-తాంసి

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన మండలంలోని పొన్నారి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాంసి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే పొన్నారి గ్రామానికి చెందిన మలపతి స్వామి(40) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని వెంటనే రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. కాగా శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడు తాంసి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తు, వ్యవసాయం చేసేవాడు. తన వ్యవసాయ భూమిలో కూరగాయలు పండించి, మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మేవాడు. ఎప్పటిలాగే గ్రామ సమీపంలోని తన చేనులోకి వెళ్లే క్రమంలో వెనుక నుంచి వచ్చి టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినట్టు ఎస్సై శివరాం తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వాహనాలను నిలిపివేసిన గ్రామస్తులు..

తమ గ్రామంలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, పలువురు మృతి చెందనట్టు తెలిపారు. ఈ ప్రమాదాలకు కారణమైన లారీ కంపెనికి చెందిన వాహనాలను నిలిపివేశారు. మృతుడి న్యాయం జరిగేంతవరకు వాహనాలను వదలబోమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

భారీగా పోలీసుల బందోబస్తు...

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి చెందడంతో గ్రామస్తులు, యువకులు, ఓ లారీ కంపెనీకి చెందిన వాహనాలను నిలిపి వేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అంత్యక్రియలు అయ్యేంత వరకు భద్రత కల్పించారు.



కురిసిన వడగండ్ల వాన



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలో శనివారం ఈదురుగాలులతో కూడిన బారీ వడగండ్ల వాన కురిసింది. దీంతో చేతికొచ్చిన మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా దెబ్బతిని, నేలకొరిగినట్టు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గిరి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 22వరకు ఆన్‌లైన్‌లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తక్షశిల తెలిపారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభా, రిజర్వేషన్ ప్రతిపాదికన ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్యా ప్రత్యేక క్రీడలు, అన్ని రంగాలలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆరో తరగతి ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష నుంచి రూ.లక్ష 50వేల మించకూడదని తెలియజేశారు. 2024 మర్చి 31 నాటికి వయసు 10-13 ఏండ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆంగ్ల మద్యమం సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. గడువులోపు విద్యార్థులు ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులలో భాగంగా మండలానికి రూ.30లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కల్వర్ట్ నిర్మాణానికి రూ.5లక్షల నిధులతో ప్రారంభించే పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వొద్నల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మండలాభివద్ధి కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు కృషితో ఎన్నో ఏండ్లుగా కలగా మిగిలిన ప్రధాన కూడలి కాల్వర్ట్, డ్రైనేజీ నిర్మాణానికి మోక్షం లభించిందని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయడానికి కృషి చేసిన శ్రీహరిరావుకు, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, రవి కిరణ్, బిట్లింగ్ నారాయణ, సమ్మెట రవి, సిరిపురం నగేష్, సురేష్, గంగయ్య పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే పర్యవేక్షణ

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలో శనివారం లెప్రసీ సర్వే కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్నటువంటి ఈ సర్వేను జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ గజానన్ పర్యవేక్షించారు. అదేవిధంగా సర్వే కార్యక్రమాన్ని విధివిధానాలను తనిఖీ చేశారు. ఏఎన్ఎంలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జరుగుతున్న పనిపట్ల సంతృప్తిని వ్యక్తపరిచారు. వారి వెంట సీనియర్ లెప్రసీ ఆఫీసర్ వామన్, ల్యాబ్ టెక్నీషియన్ రమణచారి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వేణు, ఏఎన్ఎం గంగామణి, స్రవంతి, శ్యామల, లక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని అంకోలి పీహెచ్‌సీ డాక్టర్ సర్వరాజ్ అన్నారు. శనివారం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వారి మానసిక స్థైర్యాన్ని పెంచి, పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు అవగాహన కల్పించారు. సోమవారం 18న పదో తరగతి పరీక్షలు మొదలై ఏప్రిల్ 02 వరకు జరిగే పరీక్షల పట్ల ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తమ సిబ్బంది మెడికల్ కిట్లతో క్యాంపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్, హెల్త్ అసిస్టెంట్ పవార్ ప్రేమ్ సింగ్, స్కూల్ ఇన్‌చార్జి ప్రాధానోపాధ్యాయులు సుగుణ, ఏఎన్ఎం కామేశ్వరి, ఆశ రుక్మిణి, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-బేల


మండలంలోని బేల, చెప్రాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 33 కేవీ, 11కేవీ లైన్ మరమ్మత్తు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్నీ విద్యుత్ వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

పదిలో మొదటి స్థానమే లక్ష్యం

- పరీక్షలకు సర్వం సిద్ధం
- మండల వ్యాప్తంగా 4పరీక్షా కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 960 మంది విద్యార్థులు

నవతెలంగాణ-ఉట్నూర్

పదో తరగతి ఫలితాల్లో ఉట్నూర్ మండల విద్యార్థులను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. ఇందుకోసం విద్యార్థులను అన్ని రకాలుగా సిద్ధం చేశాం. ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. పది పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో లేదు. విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన కేంద్రంలోకి అనుమతిస్తామని అన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై నవతెలంగాణతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు కలిపి 960 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో బాలురు 500 బాలికలు, 460 మంది ఉన్నారు. ఇందుకోసం 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు 4మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 4 డిపార్ట్‌మెంట్ అధికారులు, దాదాపు 60 మంది ఇన్విజిలేటర్లు, అధికారులను నియమించాం. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లను అందుబాటులో ఉంచాం. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే అధికారులకు నిబంధన గురించి శిక్షణ ఇచ్చాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, ఆదేశాలు జారీ చేశాం. కేంద్రాల్లోకి కలెక్టర్ చీఫ్ సూపరింటెండెంట్లు డీఈఓ, ఎంఈఓ లతో పాటు ఎవరికీ కూడా మొబైల్ ఫోన్‌లను అనుమతి లేదు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తారు. ఇందులో తహసీల్దార్, ఎస్సై స్థాయి అధికారి విద్యాశాఖ అధికారులు ఉంటారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు మూడు గ్రాండ్ టెస్టులను నిర్వహించాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాం. పది పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో లేదు. విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన కేంద్రంలోకి అనుమతిస్తాం. దాదాపుగా ఆలస్యం కాకుండా చూసుకోవాలి. గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలి. అన్ని పాఠశాలల్లో హాల్ టికెట్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని ఒత్తిడి తెస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. ప్రయివేట్ పాఠశాలలో హాల్ టికెట్లను ఇవ్వకపోతే నేరుగా నెట్ నుంచి డౌన్లోడ్ చేసుకొని, ఎవరి సంతకం లేకుండా పరీక్షకు హాజరు కావచ్చు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఆర్టీసీ వారు అన్ని రూట్లో బస్సులను నడుపుతున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేందుకు కెరీర్ గైడెన్స్ వారితో అవగాహన సదస్సులు కూడా నిర్వహించాం. వారిని మానసికంగా సిద్ధం చేశాం.



ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్ష తత్పరుడని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు వెనక్కి తగ్గలేదన్నారు. ఆయన పట్టుదల ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు కొలిపాక శంకర్, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య కోశాధికారి చిలువేరి శ్రీధర్, సభ్యులు చిలువేరి వెంకటేశ్వర్లు, గంధం శ్రీనివాస్, ఎక్కిరాల శ్రీనివాస్, గుండా ప్రమోద్, గుండ వెంకటేశ్వర్లు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆరెగూడ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ష చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రాథోడ్ సుభాష్, మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్ హాజరై విద్యార్థులు పలు సూచనలు చేశారు. ఇష్టపడి చదివి రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సెక్టోరల్ అధికారి అధికారి సుభాష్, మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.రవిశంకర్, రాజేశం, రమేష్, నీలిమ, అనిత, శారద, మానస, విద్యార్థులు పాల్గొన్నారు.

మూగజీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

- పశు వైద్యాధికారి శ్రీకాంత్



నవతెలంగాణ-కౌటాల

మూగజీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని సాండ్‌గాం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలను వేసి రైతులు పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధులు సోకిన వెంటనే సమాచారం అందిస్తే ఇంటికి వచ్చి వైద్యం చేస్తానని వారికి భరోసా కల్పించారు. వచ్చే నెల 15 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నాలుగు నెలలు పైబడిన పశులన్నింటికీ ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాండ్‌గాం మాజీ ఉప సర్పంచ్ సురేష్, వైద్యసిబ్బంది సందీప్, భిక్షపతి, ప్రతాప్, శోభన్, రైతులు పాల్గొన్నారు.

నూతన మైనింగ్ ఏడీకి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భూగర్భ గనుల శాఖకు సంబంధించి జిల్లాకు నూతన ఏడీగా నియమితులైన గంగాధర్, ఆర్ఐ మహేశ్వర్ రెడ్డిని ఎన్ఎస్‌యూఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని భూగర్భ గనులకు సంబంధించి పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ అలీ, నాయకులు శ్రీనివాస్, ఇమ్రాన్, నవీన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలో బస్టాండు ప్రాంతంలో సామాజిక కార్యకర్త కిర్మారె తరుణ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మండల ఆరె సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంకపూరె శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని సామాజిక కార్యకర్తలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుతుండడం వల్ల ప్రయాణికులకు మంచి నీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ఇలాగే మరికొంతమంది సామాజిక కార్యకర్తలు బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయడానికి ముందుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎలుములె కిశోర్, నర్గెవార్ రాజు, మాజీ వార్డు సభ్యులు ఇఫ్తత్ హుస్సేన్, మొరాయి తిరుపతి, శ్రీకాంత్, ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.

ఎంజెపీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబాపూలే(ఎంజెపీ) బీసీ గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ జూనియర్, మరియు డిగ్రీ కళాశాలలో రానున్న విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంజెపీ గురుకులాల జిల్లా కన్వీనర్ ఎస్.వెంకట ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 12లోపు దరఖాస్తులు చేసుకోవాలని, డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు టీఎస్‌డీసీసీఈటీ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఎంజెపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైడ్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సోనాపూర్ గ్రామ పంచాయతీలోని చిచ్చుపెల్లి గ్రామంలో ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సోనాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల చిచ్చుపెల్లి గ్రామానికి చెందిన పెందోర్ ప్రభు(30) అనే యువకుడు వివాహం అనంతరం మద్యానికి అలవాటు పడి ప్రతిరోజు భార్యతో గొడవ పడుతుండేవాడు. మద్యం తాగడానికి డబ్బులు లేకపోవడంతో ఉన్న కొంత వ్యవసాయ భూమిని సైతం అమ్మేశాడు. దీంతో భార్య ప్రభుతో విడాకులు తీసుకుంది. అప్పటి నుండి ఇంటిలో ప్రభు ఒంటరిగానే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. నాలుగు రోజుల క్రితం కూలీ పనిచేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. శివరాత్రి రోజున తన స్వగ్రామానికి వచ్చి ప్రభు మళ్లీ మద్యం తాగుతూ ఇంటిలో ఒంటరిగానే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం నుండి ప్రభు బయటకు కనపడకపోవడంతో వరుసకు చిన్నమ్మ అయిన దుర్పతాబాయి సాయంత్రం నాలుగు గంటల సమయంలో అతని ఇంటికి వెళ్లి చూడగా దూలానికి ఉరేసుకొని కనిపించాడు. మృతుడి అక్క కనక భీంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు

మండే ఎండ... ఉపాధికేదీ అండ

- ఎండవేడిమికి తట్టుకోలేక పోతున్న కూలీలు
- సేదతీరేందుకు చెట్ల నీడే దిక్కు
- పని ప్రదేశంలో కానరాని వసతులు

నవతెలంగాణ-కెరమెరి

గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో గతంలో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. 2022 వరకు ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించారు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో పనులు కొనసాగేవి. 2022 ఫిబ్రవరి నుంచి ఈజీఎస్ పనుల బాధ్యతలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంది. కూలీలకు పని ప్రదేశంలో ఏర్పాటు చేసే సౌకర్యాలకు మంగళం పాడింది. దీంతో ఉపాధి కూలీలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవాలంటే ఉపాధి పనులకు వెళ్లక తప్పని కూలీలు సౌకర్యాల లేమితో ఎండలో నానా ఇబ్బందులు పడుతూ ఉపాధి పనులు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రస్తుతం గ్రామాలకు దూరంగా పనులు చేపడుతున్నారు. పారం పాండ్స్, చిన్న ఊట నీటి కుంటలు, పార్మేషన్ రహదారులు, కంటూరి కందకాలు, మల్లింపు కాలువలు, వ్యవసాయ బావులు, నర్సరీ, పూడిక తీత పనులు, గుంతలు తవ్వడం లాంటి పనులు కొనసాగుతున్నాయి. ఎర్రటి ఎండలో కష్టపడి చెమటోడ్చి పని చేసిన వారికి కాసేపు సేద తీరడానికి సైతం అందుబాటులో నీడలేని దుస్థితి నెలకొంది.



కరంజివాడ జిపిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లా వివరాలు	
మండలాలు:	15
గ్రామపంచాయతీలు:	334
జాబ్‌కార్డులు:	1,23000
మొత్తం కూలీలు:	248000
ఆక్టివ్ జాబ్ కార్డులు :	93000
ఆక్టివ్ కూలీలు:	1,73000

పని ప్రదేశంలో వసతులు కరువు

వేసవికాలం కావడంతో ఎండలు దంచికొడుతుండటంతో ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో మౌలిక వసతులు కరువయ్యాయి. భానుడు భగభగ మండుతుండటంతో కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేసుకోవాల్సి వస్తోంది. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, మంచి నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని నిబంధనలున్నప్పటికీ అవేమి కానరావడం లేదు. పని చేస్తున్న సమయంలో గాయాలైతే ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు సైతం పని ప్రదేశంలో ఉండటం లేదు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయడమే మానేసింది. కనీసం తాగునీరు లేకపోవడంతో కూలీలు తమ వెంట నీళ్ల డబ్బాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అంతే కాకుండా గ్రామం నుంచి ఎక్కడో దూరంలో ఉన్న ప్రాంతంలో ఉపాధి పనులను గుర్తించి చేయిస్తుండటంతో కూలీలు ప్రతిరోజూ 3 నుంచి 5 కిలో మీటర్ల మేర నడిచి వెళ్తున్నారు.

నీడ లేక తిప్పలు..

వేసవి కాలం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతోంది. ఎండవేడిలో గంటల తరబడి పనులు చేస్తున్న కూలీలు అలసటకు గురై కొంత సమయం సేద తీరుదామనుకున్నా పని ప్రదేశంలో నీడ ఉండటం లేదు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు వేయాల్సి ఉండగా కొన్నేళ్లుగా అధికారులు ఆ మాటే మర్చిపోయారు. జిల్లాలలో నాలుగేండ్ల క్రితం పనిముట్లు, నీడ కోసం తాడి పత్రులు సరఫరా చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు తిరిగి అందజేసిన దాఖలాలు లేవు. గతంలో ఇచ్చిన తాడి పత్రులు ఎప్పుడో చిరిగి పోయాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులకు వెళ్లి తీవ్ర అస్వస్థకుగురై గతంలో కెరమెరి మండల కేంద్రంలో ఉపాధి కూలీలుమరణించిన సంఘనటలున్నాయి. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో తాగు నీరు, నీడ, ప్రథమచికిత్స తదితరఏర్పాట్లు చేయాలని కూలీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పభుత్వ వైద్యం అందించడంలో విఫలం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



నవతెలంగాణ-కెరమెరి

రెండు నెలలుగా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు లేక మండలంలోని గిరిజన, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముంజం శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మండల కద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించకపోవడం బాధాకరమన్నారు. మండలంలో అధిక సంఖ్యలో గిరిజనులతో పాటు పేద ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. ఈ నిరుపేద గిరిజనులు అంతా ప్రభుత్వ వైద్యంపై ఆధారపడి జీవిస్తున్నారని, వైద్యులు లేని కారణంగా గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను నియమించని కారణంగా నిరుపేద ప్రజలు ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారన్నారు. జిల్లాలోని పాలక యంత్రాంగం పట్టించుకోకపోవడంతోనే మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. జిల్లా వైద్యాధికారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ దృష్టికి తీసుకెళ్లిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల అభివృద్ధి కోసం అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, కనీస వైద్య సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్ రావు, గిర్మాజీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుస్తుందనే భయంతోనే కవిత అరెస్ట్

- ఎమ్మెల్యే కోవలక్ష్మి
- జిల్లా కేంద్రంలో రాస్తారోకో

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందనే భయంతో పార్టీ ముఖ్య నాయకురాలు, ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. లిక్కర్ కేసులో ఆ పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడంపై జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు తమ పార్టీ గెలుస్తుందనే భయంతోనే బీజేపీ ఈడీ అధికారుల సహాయంతో కవితను అరెస్టు చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీఎం నరేంద్ర మోడీ చోటాభయ్య బడా భయ్యా లెక్క వ్యవహరిస్తూ ములాఖత్ అయ్యారన్నారు. అర్ధరాత్రి మహిళను అరెస్టు చేయడం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమేనన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతిపక్షాల నాయకులను ఇబ్బందులకు గురిచేసి ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవాలని చూస్తుందని ఆరోపించారు. గత సంవత్సరం విచారణ జరగక సంవత్సరం తర్వాత ఎన్నికలకు ముందు అరెస్టు చేయడం బలం చేకూర్చుందన్నారు. కేసీఆర్ కుటుంబం ఉద్యమం సమయంలో అనేక కేసుల్లో జైలుకు వెళ్లిందని వారికి జైలు కొత్త కాదని భయపడేది లేదని హెచ్చరించారు. కవితపై కేసులు ఎత్తివేసి భేషరతుగా విడుదల చేయాలని లేదంటే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధృవదాబాయి, ఎంపీపీలు సౌందర్య, మోతిరామ్, నాయకులు మరుసుకోల సరస్వతి, గంధం శ్రీనివాస్, భీమేష్, జీవన్, నిస్సార్ పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శ్రేణులు

కుష్టువ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఆర్లీ, నవెదరి, చిచ్చుపెల్లి, లొద్దిగూడ, అంతాపూర్, సవాతీ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కుష్టువ్యాధి లక్షణాలపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించామని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. ప్రతిరోజు గ్రామాల్లోకి వెళ్లి కుష్టువ్యాధి గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంటికి వచ్చే వైద్య సిబ్బందికి వివరాలు తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణలో ప్రముఖులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని చిర్రకుంట రహదారిలో ఉన్న ఆలయంలో సల్ల మల్లన్న విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు సరస్వతి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులతో కాసేపు ముచ్చటించారు. ఆలయంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలువేరు వెంకన్న, గంధం శ్రీనివాస్, కమిటీ సభ్యులు వెంకన్న, చెంద్రయ్య, పోషన్న పాల్గొన్నారు.

పది వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో హాజరు కానున్న 6637 మంది విద్యార్థులు
- రేపటి నుండి ఎగ్జామ్స్ ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతి విద్యార్థులకు రేపటి నుండి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 2 వరకు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 6637 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం మొత్తం 37 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల వసతులు సరిగా లేకపోయినప్పటికీ ఉన్నదాంట్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారు. మొదటిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక కథనం.



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

జిల్లాలో పరీక్షలు రాయనున్న 6637 మంది

జిల్లాలో మొత్తం 6637 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా వీరిలో 6425 మంది రెగ్యులర్, 212 మంది ప్రయివేట్ విద్యార్థులున్నారు. జిల్లా విద్యాధికారులు వీరి కోసం మొత్తం 37 సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో 3 ప్రయివేట్ పాఠశాలల సెంటర్లు, 2 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 32 ప్రభుత్వ పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. వీరి కోసం మొత్తం 37 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 37 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉన్న మూడు కేంద్రాలు మోడీ, మహగావ్, గంగాపూర్ గుర్తించి ప్రత్యేక కస్టోడియంలను ఏర్పాటు చేశారు.

రేపటి నుండి పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలకు మొత్తం ఏడు పేపర్లు ఉండగా రేపటి నుండి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 2 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. గతేడాది కుమురం భీం జిల్లా రాష్ట్రంలో 30వ స్థానంలో నిలిచింది. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల్లో దీనిని అధిగమించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం డిసెంబర్ 10 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. గిరిజన, ఇతర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. మెరుగైన ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయులు శ్రమించారని చెప్పవచ్చు.

ఒక్క నిమిషం నిబంధన వర్తించదు

నిన్నటి వరకు జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు కాంపిటేటివ్ పరీక్షల వలనే ఒక్క నిమిషం నిబంధన మొదట అమల్లో ఉన్నప్పటికీ విద్యార్థుల అభ్యర్థన మేరకు పరీక్షల మధ్యలో దానిని తొలగించారు. 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మొదటి నుండి పరీక్ష సమయానికి ఐదు నిమిషాల వరకు కూడా అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. సెల్ ఫోన్ ఫ్రీ జోన్‌గా సెంటర్ ఉండాలని ప్రభుత్వం నిర్ణయం మేరకు అధికారులు విద్యార్థులు ఎవరు కూడా సెల్ ఫోన్లు తీసుకురాకూడదని ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

అశోక్, జిల్లా విద్యాధికారి



జిల్లాలో జరిగే పది పరీక్షలకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఆయా పాఠశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లతో మాట్లాడాం. విద్యార్థులకు సాధ్యమైనంత వరకు ఎక్కడ కూడా కష్టం కలగకుండా పరీక్ష రాయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. దూరప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు చేరడానికి ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాం.

పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు

ఉదయ బాబు, జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు.



పరీక్షల పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష సమయంలో 144 సెక్షన్ కేంద్రాల వద్ద అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచకూడదు. ఎలక్ట్రానిక్ వస్తువులు సెంటర్‌లోనికి అనుమతించం. విద్యార్థులకు పరీక్ష సమయం తర్వాత ఐదు నిమిషాల వరకు లోనికి వచ్చే అవకాశం ఉంటుంది.

కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో తమ కులానికి చెందిన పేదవారు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల అంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పద్మశాలి అభివృద్ధికి నిధులు కేటాయించి చేనేతపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశ్రామిక రంగంలో పద్మశాలీలు ఎదిగేలా తోడ్పాటును అందించాలన్నారు. సహకార సంఘాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి సంఘాల బలోపేతం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజయ్య, జిల్లా కోశాధికారి వనమాల మురళీకృష్ణ, నాయకులు కోమటిపల్లి లింగయ్య, శ్రీకాంత్, శైలేందర్, మోహన్, ఆవిడ ప్రణయ్, యేసయ్య, సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ సంబరాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి అశోక్ మాట్లాడుతూ నేడు మహిళలు విద్యా ఉద్యోగ రంగాలలో పురుషుల కంటే ముందంజలో ఉన్నారని అన్నారు. సమాజ ప్రగతికి మహిళలే ముఖ్యమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ మాట్లాడుతూ వివక్ష లేని సమాజం నిర్మించాలంటే బాలికా విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మహిళలు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు, ఇటీవల ఉద్యోగాలకు ఎంపికైన మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగం అధికారి ఉదయ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, ప్రముఖ వైద్యులు రుక్మిణి, సునీత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు శ్రవంతాబాయి, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు తొటం శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి పాల్గొన్నారు.



సంబరాలలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ
మంచిర్యాల
ఆదివారం | మార్చి 17, 2024 | www.navatelangana.com

గని ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

నవతెలంగాణ-మందమర్రి



ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటన మందమర్రి స్టోర్‌లో చోటు చేసుకుంది. శనివారం స్టోర్‌లో డబుల్ స్టాప్ రేకులను వాహనం లోకి ఎక్కిస్తున్న సమయంలో రోప్ బెల్ట్ తెగి కర్రె రాజు(36) మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు స్వస్థలం బెల్లంపల్లి మండలం పెరికపల్లి గ్రామం మొదట ఏ ఆర్ కానిస్టేబుల్‌గా చేసిన రాజు వారసత్వ ఉద్యోగం ద్వారా కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో 9 సంవత్సరాల నుంచి జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు.

జన్నారం ఎస్ఐగా రాజవర్ధన్ బాధ్యతలు

నవతెలంగాణ-జన్నారం



జన్నారం ఎస్ఐగా గుండేటి రాజ వర్ధన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ పోచంపల్లి సతీష్ బదిలీపై రామగుండం కమిషనరేట్‌కి వెళ్ళగా ఆయన స్థానంలో మంచిర్యాల-3 టౌన్ పోలీస్‌స్టేషన్ లో విధులు నిర్వహించిన గుండేటి రాజ వర్ధన్ జన్నారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజవర్ధన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం సింగరేణి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో చదువుతూ ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న 67 మందికి శుభాకాంక్షలు తెలుపుతూ, విద్యార్థులందరూ జీపీఏ 10/10 రావడానికి ప్రయత్నించాలని చెప్పారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, సింగరేణి సంస్థకు, సింగరేణి ఉన్నత పాఠశాలకు పేరు తెచ్చిన వారవుతారని గుర్తు చేశారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి పదవ తరగతి తొలి మెట్టు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఏ రాజేశ్వర్, పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ రాధాకృష్ణ మూర్తి పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-తాండూర్



పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. జడ్పీఎస్ఎస్ తాండూరు పరీక్షా కేంద్రమునకు చీఫ్ సూపరింటెండెంట్‌గా కె.నారాయణ, డిపార్ట్మెంటల్ అధికారిగా ఎస్.రాము నియమించగా ఈ కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. విద్యా భారతి హై స్కూల్ పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్.లింగయ్య, డిపార్ట్మెంటల్ అధికారిగా వి.శ్రీనివాస్ నియమించగా, ఈ కేంద్రంలో 201 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, డెస్క్ బెంచీలు, విద్యుత్తు, మరుగుదొడ్లు ఇతర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు అందరూ ఉదయం 9 గంటల లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 9.35 నిమిషముల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన వేల్పుల రాజం-భూమక్క వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు రాణి వివాహానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న రామకృష్ణాపూర్ ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ కుటుంబానికి రూ.10,000 వేల ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బి భూమేష్, అధ్యక్షుడు బి లక్ష్మణ్, సభ్యులు బి.సంపత్, ఎస్.మహేందర్, సీహెచ్ అశోక్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ కమిటీని శనివారం సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ప్రకటించారు. కమిటీలో బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్‌ను రెండవసారి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పేరం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల కోసం యజమాన్యంతో ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఏరియాలోని 46 మంది కమిటీని ప్రకటించారు. ఈ ఒక్క కమిటీ ప్రకటించినందుకు జనక్ ప్రసాద్ సెక్రటరీ జనరల్, సెంట్రల్ కమిటీ నాయకులు సిద్ధం శెట్టి రాజమౌళి, ఖాన్ పెళ్లి సమ్మయ్య, నరసింహారెడ్డి, పొట్టే పోషన్న, ఏరియా కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. బెల్లంపల్లి ఏరియాలోని కార్మికుల సమస్యలపై మేనేజ్మెంట్‌లో సమస్యల పరిష్కారం కోసం మాట్లాడతారని, పరిష్కరించని ఎడల కార్మికుల పక్షాన పోరాటాలు చేయడానికి ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని బెల్లంపల్లి ఏరియా కమిటీ సభ్యులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ రాష్ట్రంలో మేరు కులస్తుల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల మేరు సంఘం మండల అధ్యక్షుడు మంతెన శివకృష్ణ ఆధ్వర్యంలో చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం అన్ని కులాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని 16 కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు రామగిరి కృష్ణమూర్తి, రామగిరి సంజీవ్, మాడిశెట్టి విజయ్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్ 33/11 సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతగూడలో తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని చింతగూడ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో భాగంగా పాఠశాల భౌతిక వనరులు, తాగునీరు, ప్రహరీ గోడ, బాలికలకు మరుగుదొడ్ల వసతి, యూనిఫామ్స్‌పై చర్చించినట్లు సీఆర్పీ మంతెన రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రకాశ్, అంగన్‌వాడీ టీచర్ పల్లవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి ఉద్యోగులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో సంస్థ ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడదని డైరెక్టర్ ఆపరేషన్ అండ్ పా ఎన్‌వీకే శ్రీనివాస్ అన్నారు. శనివారం సీసీసీలో నూతన 30 మిలియన్ లీటర్ ఫర్ డే రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ నిర్మాణానికి జీఎం సంజీవరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో వారికి ఎల్లవేళలా కల్పిస్తుందన్నారు. అందులో భాగంగా రూ.16 కోట్లతో నూతన రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరుగుతుందని, ఈ రాపిడ్ గ్రాఫిక్ ఫిల్టర్స్ సుమారు ఒక సంవత్సరంలో నిర్మించి శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు నిరంతరాయంగా మంచినీటిని సరఫరా చేస్తుందని తెలిపారు.



ఇటువంటి రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ ను అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే అవసరాలకు ఆయా ప్రభుత్వాలు నిర్మించేవని, కానీ సింగరేణి సంస్థ ఎన్నో సంవత్సరాల ముందే వీటిని నిర్మించి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో తమ వంతు పాత్ర నిర్వహిస్తుందని తెలిపారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు పంచ భూతాలతో పోరాటం చేస్తున్నారని, అటువంటి వారి కోసం సంస్థ ఎంతటి ఖర్చు చేయడానికి అయినా వెనకాడకుండా కావలసిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, అధికారుల సంఘం కేంద్ర కార్యదర్శి నరసింహులు, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా సెక్రటరీ చంద్రశేఖర్, జనరల్ మేనేజర్ సివిల్ సూర్యనారాయణ, ఎస్ఓ టు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక జేటీఓ ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం



అధికారుల వేధింపులు తాళలేక జూనియర్ టెక్నికల్ ఆఫీసర్(జేటీఓ) తోకల రాకేష్(37) రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాకేష్ కడం నారాయణరెడ్డి ప్రాజెక్టు డివిజనల్ ఈఈ కార్యాలయంలో జేటీఓగా పనిచేస్తున్నాడు. కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లు సంవత్సర కాలంగా వేదింపులకు గురిచేస్తున్నారు. మూడు నెలల క్రితం మృతుడి తండ్రి చనిపోవడంతో 15 రోజులు సెలవు కావాలని అడిగాడు. సెలవు లేవని విధులకు తప్పక హాజరు కావాలని లేదంటే ఉద్యోగం మానేయాలని అధికారులు హెచ్చరించారు. ఆ ఇద్దరి అధికారుల వేధింపులు భరించలేక మృతుడు రాకేష్ చాలాసార్లు చనిపోతానని కుటుంబ సభ్యులతో చెప్పాడు. అధికారుల వేధింపులు భరించలేక ఉద్యోగం కూడా చేయలేక పోతున్నానని బాధపడేవాడు. అదే క్రమంలో గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు తల్లి తోకల సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మూడు నెలల వ్యవధి లోనే భర్త, కొడుకు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రాకేష్ మృతికి కారణమైన ఆ ఇద్దరి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు బీఆర్ఎస్ నిరసన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసినందుకు నిరసనగా గద్దెరాగడిలోని అమ్మ గార్డెన్ ప్రాంతంలో హై వే రోడ్ మీద బిఆర్ఎస్ నాయకులు శనివారం ధర్నా చేపట్టారు. ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇంటి సోదా పేరుతో వచ్చి అరెస్టు చేయడం ఒక పిరికిపంద చర్యగా యావత్ తెలంగాణ ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోని రెండు పార్టీలు ఒకటై బీఆర్ఎస్‌ను లేకుండా చేద్దామని నీచమైన ఆలోచనతోనే ఇలాంటి ఒక తప్పుడు కేసులో ఇరికించి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కవితను వెంటనే విడుదల చేసి సాక్షాలు ఉంటే న్యాయపరంగా కొట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మన్న, బీఆర్ఎస్ కౌన్సిలర్, బీఆర్ఎస్ యూత్ నాయకులు కొండ కుమార్, ఛంద్ర కిరణ్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంల్లో పోషణపక్వాడ



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మాదారం గ్రామపంచాయతీలోగల అంగన్‌వాడీ కేంద్రంలలో సూపర్‌వైజర్ మమత పోషణ పక్షోత్సవాలు నిర్వహించగా తాండూర్ బేస్తవాడలలో సూపర్‌వైజర్ స్వరూప రాణి పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లులకు, పిల్లలకు పోషణకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. గర్భిణీ స్త్రీ తన తొమ్మిది నెలల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వాడకం గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ నాగమణి, సత్యవతి, అనసూర్య, యదలక్ష్మి, మీనా, విజయలక్ష్మి, ధనలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

కాసిపేట : గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక సూచించారు. శనివారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లి 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడలో భాగంగా పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ ఆరు నెలల వరకు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 6 నెలలు నిండిన పిల్లలకు అదనపు ఆహారం ఇవ్వాలని, చిరు ధాన్యాల్లో పోషక విలువల ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పోషన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, గర్భిణీలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో సోమవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఎంఈఓ వాసాల ప్రభాకర్ కాసిపేట మండలంలో ఏర్పాటు చేసిన మూడు పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ మోడల్ స్కూల్లోని పరీక్షా కేంద్రానికి సీఎస్ సుధాకర్ నాయక్, డీఓగా కుడుదుల శ్రీనివాస్‌ను నియమించగా 176 మంది విద్యార్థులున్నారని, దేవాపూర్ డీఏవీ పాఠశాలలో సీఎస్‌గా సాంబమూర్తి, డీఓగా జి శ్రీనివాస్‌ను నియమించగా 124 మంది విద్యార్థులున్నారని, మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలలో సీఎస్ రాథోడ్ రమేశ్, డీఓగా రమణారెడ్డిలను నియమించగా 73 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు 9 గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 9:35 తర్వాత అనుమతించరని వివరించారు.



ఆనందోత్సవాల మధ్య సీఓఈ వార్షికోత్సవం



నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ(సిఓఈ), బెల్లంపల్లిలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా బెల్లంపల్లి ఆర్డీఓ పోరిక హరికృష్ణ, బెల్లంపల్లి ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా డీసీఓ పోలోజు బాలరాజులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యక్షతన ముఖ్య అతిదులు వారిషికోత్సవ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పోరిక హరికృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకుపోవాలన్నారు. ఎలాంటి భయం లేకుండా విద్యార్థులు చక్కగా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఈ విద్యా సంవత్సరంలో జరిగిన విద్యా సంబందిత విజయాలపై ప్రత్యేకంగా తయారుచేసిన వార్షిక నివేదికను వివరించారు. అదేవిధంగా చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు బెస్ట్ స్టూడెంట్ అవార్డ్సును ముఖ్య అతిదులతో అందజేశారు.

కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు కష్టపడి చదివి ఉద్యోగాల్లో స్థిరపడాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలోని గ్రంథాలయంలో ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగాలకు సంసిద్ధం అవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అమ్మ ఒడి ఎన్జీఓ ఏర్పాటుచేసిన ఉచిత భోజన కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. టీఎస్పీ తరహా ఉద్యోగ ప్రకటనల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు కష్టపడి చదివిన వారి కుటుంబ సభ్యుల కలలు నిజం చేయాలని సూచించారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తోడే పద్మారెడ్డి, కృష్ణరెడ్డి సహాయ సహకారలతో మాజీ కౌన్సిలర్ వంశీ కృష్ణరెడ్డి జ్ఞాపకార్థంగా అమ్మ ఒడి ఎన్జీఓ అన్నదాన ప్రాజెక్ట్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తోడే పద్మారెడ్డి అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల మధుకర్, బ్రాంచి మేనేజర్ హనుమాండ్ల సువర్ణ, నారాయణ, గన్నెవరం తిరుమలచారి, ఎండీ యూసుఫ్, మేరుగు రామకృష్ణ యాదవ్, పికా లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమం రద్దు

నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ వివరాలు ప్రకటించడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల శాశ్వత పరిష్కారం



నవతెలంగాణ-లక్సెట్టిపేట

లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు ఎలాంటి అప్పీలుకు అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం జరుగుతుందని లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. లక్సెటిపేట మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోర్టు పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉండి ఇరువైపులా పార్టీలు రాజీపడే అవకాశం ఉన్న కేసులు పరిష్కారించేందుకు లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామన్నారు. క్షణికావేశాల్లో చేసిన తప్పలకు కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకొని మంచి జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, న్యాయవాదులు రాజేశ్వరరావు కేతిరెడ్డి భూమారెడ్డి అక్కల శ్రీధర్ కొమ్మిరెడ్డి సత్తన్న గాండ్ల సత్యనారాయణ జి.పద్మ, వేల్పుల సత్యం, తాజోద్దీన్, రెడ్డిమల్ల ప్రకాశం, కుడెల్లి చాతరాజు, మల్లికార్జున్, గణేష్, సంజన వినీత పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుడు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడు పీ మధు శనివారం ఉదయం సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్టీపీపీ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్న మధుకు సంబంధించి పీఎఫ్ కట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గత ఆరు సంవత్సరాలుగా పవర్‌మేక్ కంపెనీలో పని చేస్తుండగా కంపెనీ పీఎఫ్ కట్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోగల సెల్ టవర్ ఎక్కిన మధు కంపెనీ బాధ్యుల ద్వార స్పష్టమైన హామీ ఇస్తే తప్పా సెల్ టవర్ దిగనని పట్టుబట్టి కూర్చున్నాడు. విషయం తెల్సుకున్న ఎస్టీపీపీ పవర్ మేక్ కంపెనీ ప్రతినిదులు సంఘటనా స్థలానికి చేరుకుని పీఎఫ్ కటింగ్‌లో తలెత్తిన సమస్యను వివరించడంతో పాటు పీఎఫ్ కట్ చేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సర్దుమనిగింది.

బదిలీపై వెళ్తున్న అధికారికి వీడ్కోలు

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలో డీజీఎం(సివిల్)గా పనిచేసి కార్పొరేట్ జీఎం సివిల్ కార్యాలయానికి బదిలీపై వెళున్న ఆర్.సతీష్‌బాబుకు శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ ఈ సందర్భంగా సతీష్‌బాబు సేవలను కొనియాడారు. అనంతరం మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పీఓ ఉమాకాంత్, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న , డీజీఎం ఈఅండ్‌ఎం ఏరియా వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీజీఎం ఎఫ్అండ్ఎ రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఈఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రుక్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



పట్టణంలోని రాంపూర్ గ్రామంలో శనివారం సురుకుంటి రుక్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకొని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని, ఆధైర్యపడవద్దని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిత అరెస్టు బీజేపీ కుట్ర



నవతెలంగాణ-జైనూర్

కేంద్రంలో అధికారంలో ఉండి అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం బీజేపీ కుట్రనేనని సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. శనివారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు భారీఎత్తున జైనూర్ మండలకేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బ్లాక్‌మేల్ రాజకీయం జరుగుతుందన్నారు. అధికారంలో ఉండి ఈడీ దాడులు చేసి బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఇలాంటి అరెస్టుకు భయపడదని, ఇలాంటి అరెస్టులు చేయడం, మహిళలను అవమానించడం సరైనపద్ధతి కాదని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెపుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(యు) ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, లింగాపూర్ జెడ్పీటీసీ అడె రక్కాబాయి లక్కానాయక్, జైనూర్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ జావీద్ అలీ, కేశవ్, మాజీ సర్పంచ్‌లు మెస్రం రాహుల్, బీఆర్ఎస్ సిర్పూర్(యు) మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్, ధర్మారావు, సిర్పూర్(యు) వైస్ ఎంపీపీ ప్రకాష్ తెలిపారు.

ఖైరిగూడ ఓసీలో డీజిల్ బ్రోజర్ ప్రారంభం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడలో శనివారం 3 క్యూబిక్ మీటర్ శవల్ రూ.1.50 కోట్లు, రూ.19. 50 లక్షల విలువ గల డీజీల్ బ్రోజర్‌ను శనివారం బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ ప్రారంభించారు. అనంతరం వేసవికాలం దృష్ట్యా తీసుకుంటున్న జాగ్రత్తలో భాగంగా శనివారం జనరల్ మేనేజర్ రవిప్రసాద్ చేతులమీదుగా సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాల వల్ల పని గంటలు మెరుగుపరుచుకొని, ఎప్పటికప్పుడు యంత్రాల పని తీరు, బెల్లంపల్లి ఏరియాలో ఖైరిగూడ ఓసీపీలో రికార్డుస్థాయిలో ఉత్పత్తి, ఉత్పాదకత సాధించాలని కార్మికులు, ఉద్యోగులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, ఖైరిగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు భయ్య మొగిలి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ మారం శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి వీరన్న, గని మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్, సేఫ్టీ ఆఫీసర్ పి రాజేశ్వర్‌రావు, డీవైపీఎం వేణు, ఇంజనీర్‌లు నరేష్, మహేష్, బాలయ్య, చుక్కయ్య, శంకర్ పాల్గొన్నారు.

నేటి నుండి కౌన్సెలింగ్ తరగతులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులతో పాటు డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నేటి నుండి కాంటాక్టు మరియు కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఆదివారంతో పాటు రెండో శనివారం యూనివర్శిటీ షెడ్యూల్ ప్రకారంగా ఈ తరగతులు ఉంటాయని, విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9866398678 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద శిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా శనివారం మాతా రిసెర్చ్ సెంటర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ విశ్వనాథ మహర్షి నేతృత్వంలో గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సింగరేణి ఉద్యోగులు, కార్మిక కుటుంబాల సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీల వ్యాధులు తదితర వాటికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతినెల 16న గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ శిబిరం ఉంటుందని ఆయన తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీలో చేరికలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కౌటాల మండలానికి చెందిన బీఆర్ఎస్, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు శనివారం భారతీయ జనతాపార్టీలో చేరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరగా, వీరికి ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పార్టీ కండువాలు కప్పారు. పార్టీలో చేరిన వారిలో రాచకొండ అశోక్, దుర్గం మారుతి, గోమాజీ, రావుల విజయ్, చొక్కారాం, కామ్రె వాసుదేవ్, శ్రీనివాస్ ఉన్నారు.



వైద్య కళాశాల, ఆస్పత్రి సమన్వయంతో పనిచేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవి కుమార్

జిల్లా కేంద్రంలో ఉన్న వైద్య కళాశాల, సామాజిక ఆస్పత్రి సమన్వయంతో పని చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న 130 పడకల ఆస్పత్రికి అనుబంధంగా మెడికల్ కాలేజీ నిర్మించడంతో 330 పడకల ఆస్పత్రిగా అవతరించడం సంతోషంగా ఉందన్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం నిర్వహణ కోసం ఉండాల్సిన నిరంతర విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో జనరేటర్‌తో నిర్వహించే పరిస్థితి ఏర్పడిందని, దీని నిర్వహణ కోసం గతంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ బోర్డు నిధులు సమకురుస్తూ వచ్చిందన్నారు. కానీ కొంత కాలంగా వారు నిధులు సమకూర్చడం లేదన్నారు. దీంతో జిల్లా కేంద్రంలో డయాలసిస్ కేంద్రం నిర్వహణ భారం రోగులపై పడుతుందన్నారు. గతంలో ఒప్పంద పద్ధతిలో నియామకాలు జరిగాయని, వారి ఒప్పంద కాలం ముగిస్తున్నప్పటికీ తిరిగి వారిని ఏ విధంగా భర్తీ చేయాలనే దానిపై అధికారుల మధ్య స్పష్టత కొరవడిందన్నారు. మెడికల్ కళాశాల కానీ దాని అనుబంధ ఆస్పత్రి కానీ యంత్రాలు పరికరాలు ప్రజలకు సంపూర్ణ స్థాయిలో ఉపయోగపడి, సేవలు అందించాకంటే ఈ రెండింటి మధ్య సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కూషన రాజన్న, కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు దుర్గం రాజ్ కుమార్, గొడిసెల కార్తిక్, జాదవ్ రాజేందర్, నేర్పెల్లి అశోక్ పాల్గొన్నారు.

పది పరీక్షల ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-జైనూర్

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జైనూర్ మండల విద్యాధికారి కుడిమెత సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. మండల వ్యాప్తంగా 428 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 208 మంది, ఆశ్రమ పాఠశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్టు తెలిపారు. ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు తగు జాగ్రత్తలపై సూచనలు చేశామన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, మైక్రోఫోన్ లాంటి వాటికి అనుమతిలేదని తెలిపారు. ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జాదవ్ మధుసూధన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్, ఫెరోజ్, జంగు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఈ నెల 18వ తేదీన జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని ఇన్‌చార్జి ఎంఈఓ సోమయ్య తెలిపారు. సిర్పూర్ మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు, దీనిలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 199 మంది విద్యార్థులు, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర విద్యాలయంలో 195 మంది, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో 181 మంది మొత్తం 575 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా సకాలంలో వారికి కేటాయించిన పరీక్ష కేంద్రానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయలన్నారు. విద్యార్థులకు వేసవికాలం దృష్ట్యా మంచినీరు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.



ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలుకు సిద్ధం

- ఆసిఫాబాద్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో జరగనున్న లోక్ సభ సాధారణ ఎన్నికలకు సంబంధించి తెలంగాణలో కూడా శనివారం నుండి ఎన్నికల కోడ్ వచ్చిందని పకడ్బందీగా అమలు చేయడానికి అంత సిద్ధంగా ఉన్నట్లు, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ కరుణాకర్ తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18వ తేదీన వస్తుందని, ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఏప్రిల్ 25 నుండి ప్రారంభమవుతుందని, విత్ డ్రా ఏప్రిల్ 29 వరకు ఉంటుందని, మే 13న ఎన్నికలు నిర్వహించనున్నట్లు, జూన్ 4న లెక్కింపు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఉన్న నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఆదిలాబాద్ కలెక్టర్ వ్యవహరించనున్నట్లు, ఏఆర్ఓలుగా జిల్లా అదనపు కలెక్టర్లు వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలో 4,55,437 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్క ఓటరు కూడా తప్పకుండా నమోదు ప్రక్రియ కొనసాగడానికి స్వీప్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఉంటారని, అంతర్రాష్ట్ర అంతర్గత చెక్ పోస్టుల ఏర్పాటు, ఎన్నికల ఫిర్యాదు కోసం సి విజిల్ ఆప్ అందుబాటులో ఉంటుందని, దీనిని ఆన్ రైడ్ ఫోన్లలో డౌన్ లోడ్ చేసుకొని ఎన్నికల్లో జరిగే అవకతవకలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు వచ్చిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారి తుది నిర్ణయం తీసుకుంటారని, పోలింగ్ కేంద్రాలలో సాధారణ సౌకర్యాల కంటే తక్కువ, ఎక్కువ అని రెండు విధాలుగా విభజించినట్లు తెలిపారు. మౌలిక వసతులపై ప్రధాన దృష్టి కేంద్రీకరించినట్లు వివరించారు. గతంలో వచ్చిన అనుభవం మేరకు రూ.50 వేల కంటే ఎక్కువగా వెంట తీసుకు వెళుతున్నప్పుడు వాటిని స్వాధీనం చేసుకుంటే ఆధారాలను సమర్పించిన వెంటనే తిరిగి ఇవ్వడానికి ప్రత్యేక నమూనా సిద్ధం చేశామన్నారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి భయాలు లేకుండా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాకు అదనంగా కేంద్ర బలగాలు 10 కంపెనీలు వచ్చాయని, ప్రస్తుతం కూడా కేంద్ర బలగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇవి గ్రామాల సందర్శన, ఫ్లాగ్ మార్చ్ వంటివి చేసి మావోయిస్టుల చర్యలపై ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేస్తాయని పేర్కొన్నారు. ప్రశాంత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

కొత్తవారి నియామకాలు నిలిపివేయాలి

- కాంట్రాక్టు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఓదేలు



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాల్లో కొత్తవారి నియామకాలు వెంటనే నిలిపివేయాలని, ప్రొఫేషనల్ ట్యాక్స్ వెంటనే రద్దు చేయాలని, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్ కొత్తవారి నియామకాలు, ప్రొఫేషనల్ ట్యాక్స్, రెండు జతల యూనిఫామ్ డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చిన తర్వాత సానుకూలంగా స్పందించిన సమస్యల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంట్రాక్టు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఎ ఓదేలు మాట్లాడుతూ ఆర్ఎంజీ కాంట్రాక్టర్ మహేందర్‌గౌడ్ ప్రస్తుతం పనిచేస్తున్న గార్డ్స్‌కు అదనంగా మరో ఇద్దరిని కొత్తగా నియమించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. రెండు నెలల క్రితమే నలుగురు ప్రయివేటు సెక్యూరిటీ గార్డులను కొత్తగా నియమించారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో ఇప్పటికే 124 పోస్టులకు బదులుగా 117 పోస్టులకు తగ్గించారన్నారు. 47 మంది గార్డులు అదనంగా ఉన్నారని, దీనివల్ల ప్రయివేటు సెక్యూరిటీ గార్డులుగా పనిచేసే వారికి మాస్టర్స్ తగ్గి వేతనాలు తక్కువగా రావడంతో ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. సింగరేణిలో ఎక్కడాలేని విధంగా ప్రొఫేషనల్ ట్యాక్స్ బెల్లంపల్లి ఏరియా ప్రయివేటు సెక్యూరిటీ గార్డుల వద్ద నెలకు రూ.150 కట్ చేస్తున్నారన్నారు. వెంటనే ప్రొఫేషనల్ ట్యాక్స్ రద్దు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు వినతిపత్రంలో జీఎంకు రాతపూర్వకంగా తెలియజేసినప్పటికీ ప్రొఫేషనల్ ట్యాక్స్ రద్దు కాలేదన్నారు. జీఎం ఇప్పటికైనా చొరవ తీసుకొని ప్రయివేటు సెక్యూరిటీ గార్డుల ప్రొఫేషనల్ ట్యాక్స్ రద్దు చేసి ప్రయివేటు సెక్యూరిటీ గార్డులను ఆదుకోవాలన్నారు. అలాగే గార్డులకు ఒకటే యూనిఫామ్ ఉండడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, రెండు జతల యూనిఫామ్ వెంటనే ఇవ్వాలన్నారు. రాజకీయ నాయకుల పైరవీలు చేసి కాంట్రాక్టర్లపై, జీఎంపై ఒత్తిడి తీసుకురావడానికి బదులు పోస్టులు పెంచి కొత్త ఉద్యోగాల నియామకాలు చేస్తే మంచిదన్నారు. వారం రోజుల్లో కొత్త నియామకాలు నిలుపుదల చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో జీఎం కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల జాక్సన్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఎండీ యూసుఫ్, కోట కరుణాకర్, బి రవికుమార్, ఆర్ మోవాన్, నాగేష్, గణపతి, సతీష్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాజీ మార్గమే రాజ మార్గంగా భావించి పంతాలకు పోకుండా కోర్టుల చుట్టూ తిరిగి తమ సమయాన్ని వృథా చేయకుండా కక్షిదారులతో రాజీ కుదుర్చుకోవడమే ఉత్తమని సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. రాజీ ద్వారా 66 కేసులు, జరిమానా విధించిన కేసులు 1163, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఒక కేసు మొత్తం 1230 కేసులు పరిష్కంచరించామని తెలిపారు. కోర్టు చుట్టూ తిరగడం వల్ల మానసిక, ఆర్థిక ఇబ్బందులతో పాటు సమయం వృథా అవుతుందని, దీనిని గమనించి కేసులు పెట్టిన వారు తమ ప్రత్యర్థులతో మాట్లాడుకొని రాజీ కుదుర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎలీశ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి కిశోర్‌కుమార్, న్యాయవాదులు, శంకర్‌రావు, గణపతి, కళ్యాణ్, కాగజ్‌నగర్, సిర్పూర్ బ్యాంకు మేనేజర్‌లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీస్ అధికారులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు నూతనంగా వచ్చిన సీసీఎస్ సీఐ జగదీష్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబులు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శాంతిభద్రతలకు సంబంధించిన పలు అంశాలు జిల్లా ఎస్పీ వారికి వివరించారు.

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



నవతెలంగాణ-నిర్మల్

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎల్ఆర్ కంపెనీ దోపిడీని అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాకూరి తిరుపతి, దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని కడెం ప్రాజెక్టు నుండి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న పిఎల్ఆర్ కంపెనీ వాటర్ సప్లయర్స్ కార్మికులకు కనీస వేతనం చెల్లించకుండా శ్రమదోపిడీకి గురి చేస్తున్నారని విమర్శించారు. రూ.16వేల వేతనం చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.8వేలు మాత్రమే చెల్లిస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికీ గుర్తింపు కార్డులు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఇవ్వడంలో చాలాసార్లు జాప్యం చేయడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 70 నుండి 80 మంది కార్మికులు పనిచేస్తుంటే, 150 మంది పని చేస్తున్నట్టుగా తప్పుడు లెక్కలు చూయించి ప్రభుత్వం నుంచి డబ్బులు కాజేస్తున్నారని విమర్శించారు. వెంటనే శ్రమదోపిడీని అరికట్టాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు, తెల్ల కల్లు బట్టీలను ఎత్తేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులు, తెల్ల కల్లు బట్టీలను ఎత్తివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అజ్మీర వినోద్‌కుమార్, పీఓడబ్ల్యు జిల్లా నాయకురాలు మడావి రేణుక డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుమురం భీమ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయన్నారు. ఎక్సైజ్ అధికారులు వీటిపై చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజన యువకులు మద్యం తాగి ఆనారోగ్యానికి గురవుతున్నారని, గిరిజన యువకుల జీవితాలు, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని వాపోయారు. అధికారులు విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజన గ్రామాలలో తెల్ల కల్లు బట్టీలు విచ్చలవిడిగా మత్తు పదార్థాలు కలిపి అమ్ముతున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్, జిల్లా నాయకులు శ్యాంసుందర్, పీఓడబ్ల్యు నాయకులు వనిత, రుక్మాబాయి, అంజు, లక్ష్మిబాయి పాల్గొన్నారు.

